క్లుప్తంగా

రోడ్డుపైనే మురుగునీరు



రాకపోకలకు ఇబ్బందిగా మురుగునీరు

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహానగర్‌లో నర్సింహా ఆలయం వెనుక వీధిలో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. డ్రెయినేజీ నిర్మించకపోవడంతో ఇళ్లలోని మురుగు నీరు ఇలా రోడ్డుపైనే చేరుతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం కచ్చా డ్రెయిన్ అయినా నిర్మించి రోడ్డుపై మురుగు నీరు పారకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కుంటాల ఎస్సై బదిలీ

కుంటాల: కుంటాల ఎస్సైగా పని చేసిన సీహెచ్ భాస్కరాచారి బాసర ఎస్సైగా బదిలీపై వెళ్లారు. కుంటాల ఎస్సైగా సుప్రియ రానున్నట్లు సమాచారం.

భక్తి మార్గంలో నడవాలి

తానూరు: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన భారత్ మహారాజ్ సూచించారు. మండలంలోని మొగ్గి గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన కీర్తన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భక్తిమార్గంపై పలు సూచనలు చేశారు. ఆధ్యాత్మిక సాధనతోనే ప్రశాంతత సాధ్యమని.. చెడువ్యసనాలకు దూరం ఉంటూ ఆధ్యాత్మిక బాటలో పయనించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వారకరి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెట్ల నరికివేత



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం సమీపంలో ఏర్పాటు చేసిన హరితవనంలో చెట్ల నరికివేత కొనసాగుతుంది. శుక్రవారం గ్రామస్తులు మరో 150 చెట్లను నరికివేశారు. దీంతో అటవీశాఖ అధికారులు.. గ్రామస్తులతో చర్చల్లో పురోగతి కన్పించడం లేదు. పోచమ్మ ఆలయ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తేనే చెట్ల నరికివేత నిలిపివేస్తామని గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ గీతారాణి, అటవీశాఖ అధికారులు ప్రభాకర్, శ్రీనివాస్, నిమాన్ తదితరులు ఉన్నారు.

వెయ్యేళ్ల బాసర శిల్పాలను పరిరక్షించాలి



శిల్పాలను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

బాసర: బాసరలోని పాపహరేశ్వరస్వామి ఆలయం ముందు వెయ్యి ఏళ్లనాటి శిల్పాలను పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు, స్థానిక చరిత్రకారులు బలగం రామ్ మోహన్ ఇచ్చిన సమాచారంతో శుక్రవారం బాసర పరిసరాల్లోని చారిత్రక ఆనవాళ్లు, శాసనాలను పరిశీలించారు. ఆంజనేయస్వామి ఆలయం ముందు 11వ శతాబ్దం జైన శాసనం, గణేశాలయంలో ఎనిమిదో శతాబ్ది నాటి 5 అడుగుల ఎత్తున్న బాదామి చాళుక్య గణేశ శిల్పం, పాపహారేశ్వరాలయం ముందున్న 9, 12వ శతాబ్దానికి చెందిన జైన యక్షిణి, భైరవ, లింగం, నంది, గణేశ, సతి శిలలు, దాన శాసనాలు, విరిగిన శిలా తోరణాలను భద్రపర్చాలని పేర్కొన్నారు. వారి వెంట బి.సుధాకర్ సింగ్, ధర్మేంద్ర కిరణ్, మోతీలాల్ తదితరులు ఉన్నారు.

రోజూ పేపర్ చదవాలి



అజీజ్

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ జ్యోతి బాపూలే (ఎంజేపీ)బాలుర గురుకులంలో భౌతికశాస్త్రం బోధించే అజీజ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్(జేఎల్)గా ఎంపికయ్యాడు. ఈనెల 12న హైదరాబాద్ రవీంద్రభారతిలో నియామక పత్రం అందుకున్నారు. జిల్లాకేంద్రంలోని గాజుల్‌పేట్‌కు చెందిన అజీజ్ రాచాపూర్ గురుకులంలో పని చేస్తూనే పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యాడు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఫలితాల్లో 32వ ర్యాంకు సాధించాడు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువకులకు అజీజ్ పలు సూచనలు చేశారు. దినపత్రిక, ప్రమాణికమైన మెటీరియల్ చదువుతూ నోట్స్ తయారు చేసుకోవాలని పేర్కొన్నారు.

హోలీ.. రంగోలీ

ఖానాపూర్ : మస్కాపూర్‌లో వేడుకల్లో పాల్గొన్న యువకులు



నిర్మల్‌లో వేడుకలో పాల్గొన్న ఎస్టీయూ సంఘం నాయకులు



భైంసారూరల్ : దేగాంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి రంగులు పూస్తున్న యువకులు



తానూరులో రంగుల వేడుకలో చిన్నారులు



జిల్లావ్యాప్తంగా శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గల్లీల్లో చిన్నారులు, యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు చెప్పకొన్నారు. డీజే పాటలకు నృత్యాలు చేస్తూ సరదాగా గడిపారు. నిర్మల్‌లోని గాంధీచౌక్ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవార్‌పేట్, చింతకుంటవాడ, ఖస్బా, బాగులవాడ మీదుగా ర్యాలీ నిర్వహించారు. విధుల్లో బిజీగా ఉండే పోలీస్ అధికారులు, సిబ్బంది హోలీ సంబరాల్లో మునిగి తేలారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. ఏఎస్పీలు అవినాష్‌కుమార్, రాజేశ్‌మీనా, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. భైంసాలోని ఎస్ఎస్ కాటన్‌లోని తన నివాసంలో అనుచరులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు రంగులు పూసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ తన మనవళ్లతో పండుగ జరుపుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దేగాంలోని తన నివాసంలో వేడుకల్లో పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



నిర్మల్‌లో ఓ అపార్ట్‌మెంట్ వద్ద హోలీ ఆడుతున్న మహిళలు, యువకులు, చిన్నారులు



కడెం: కొండుకూర్‌లో..



కుభీర్‌లో హోలీ ఆడుతున్న యువకులు



లక్ష్మణచాంద : పొట్టపెల్లిలో..



క్యాంప్ కార్యాలయంలో వేడుకల్లో అధికారులు



లోకేశ్వరం: కిష్టాపూర్‌లో హోలీ ఆడుతున్న మహిళలు



నిర్మల్‌లో టీయూటీఎఫ్ నాయకుల వేడుక



నిర్మల్‌లోని సోఫినగర్‌లో హోలీ ఆడుతున్న మహిళలు



కుంటాల: వేడుకల్లో దౌనెల్లితండాలో గిరిజన మహిళలు



దస్తురాబాద్ ఆశ్రమ పాఠశాలలో పాల్గొన్న విద్యార్థినులు



ముధోల్ ఎమ్మెల్యే రామారావుకు రంగు పూస్తున్న నేతలు

దాహం తీర్చని నీటి తొట్టీలు

ఈ చిత్రం లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లి గ్రామంలోనిది. ఉపాధిహామీ పథకం కింద నిర్మించిన పశువుల నీటితొట్టికి నీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో గేదెలు తొట్టిల వద్దకు వచ్చి నీటి కోసం దీనంగా ఎదురుచూస్తున్నాయి.





పై చిత్రం మండలంలోని ధర్మారం గ్రామంలోనిది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పశువుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన తొట్టికి నీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో తొట్టి నిరుపయోగంగా మారింది. వెంటనే తొట్టిలోకి నీటిని నింపాలని రైతులు కోరుతున్నారు.



ఈ చిత్రం పశువుల మంద వద్ద నిర్మించిన ఈ నీటి తొట్టి మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలోనిది. ఇక్కడ పశువుల నీటి తొట్టి నిర్వహణ సరిగా లేకపోవడంతో ధ్వంసమైంది. అధికారులు స్పందించి తొట్టిలోకి నీటిని నింపాలని ప్రజలు కోరుతున్నారు.

- గ్రామాల్లో గోసపడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు
- తొట్టీల్లో నీటిని నింపాలంటున్న ప్రజలు

లక్ష్మణచాంద: వేసవికాలం నేపథ్యంలో మూగజీవాలు దాహార్తి తీర్చుకునేందుకు అల్లాడుతున్నాయి. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున గ్రామాల్లోని వాగులు, కుంటలు, చెరువుల్లో నీటి వనరులు అడుగంటుతున్నాయి. వేసవి కాలంలో మూగజీవాల దాహం తీర్చాలనే ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలోని అన్ని గ్రామాల్లో పశువుల నీటి తొట్టీలు నిర్మించారు. ఆ తొట్టీలో నీటిని నింపడంతో పశువులు దాహం తీర్చుకున్నాయి. ఆ తర్వాత సంబంధిత అధికారులు, వీడీసీ సభ్యులు ఈ తొట్టీల నిర్వహణను గాలికొదిలేశారు. మెజార్టీ గ్రామాల్లో పశువుల నీటి తొట్టీలు నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాలు తొట్టీల దగ్గరకు వెళ్లి నీటి కోసం దీనంగా చూస్తున్నాయి.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద మండలంలో 18 పంచాయతీల పరిధిలో 23 గ్రామాలున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2016–2018 మధ్య కాలంలో ఒక్కో గ్రామంలో పశువుల దాహార్తి తీర్చేందుకు రెండు నీటి తొట్టీలు నిర్మించారు. సైజును బట్టి ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ.15 వేల నుంచి రూ.25వేల వరకు ఖర్చు చేశారు. కానీ తొట్టీలకు నీటి సరఫరా లేకపోవడంతో ప్రభుత్వ ధనం వృథా అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

నీటి సౌకర్యం కల్పించాలి..

ఇప్పటికైనా పంచాయతీ, ఈజీఎస్ అధికారులు, పాలకులు, వీడీసీ సభ్యులు స్పందించి.. ఆయా గ్రామాల్లో నిర్మించిన తొట్టీల్లో నీటిని నింపి పశువుల దాహార్తి తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు, కాపరులు వేడుకుంటున్నారు. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయని.. మందల వద్ద నీటి సౌకర్యం కల్పిస్తే మూగజీవాల దాహం తీరుతుందని విన్నవిస్తున్నారు.

ఇబ్బందిగా ఉంది



మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన తొట్టీల్లో నీళ్ల లేకపోవడంతో పశువులు గోస పడుతున్నాయి. కాపరులు సైతం ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

– భూమేశ్, పొట్టపెల్లి


చర్యలు తీసుకోవాలి



ఉపాధిహామీ పథకం కింద నిర్మించిన నీటి తొట్టీల్లో నీటిని నింపేలా అధికారులు, వీడీసీ సభ్యులు చర్యలు తీసుకోవాలి. తొట్టీల్లో నీటిని నింపితే మూగజీవాలకు నీటి కష్టాలు తీరుతాయి.

– భీమేశ్, తిర్పెల్లి

నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడు..



మెదన్‌పూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం



అంబుగామలో అర్ధంతరంగా నిలిచిపోయిన నిర్మాణ పనులు

- అర్ధంతరంగా నిలిచిన గ్రామపంచాయతీ కార్యాలయాలు
- అద్దె భవనాల్లో కొనసాగింపు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, సిబ్బంది

కుంటాల: ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. గతంలో కుంటాల మండలంలో 11 గ్రామ పంచాయతీలుండేవి. తర్వాత వెంకూర్, అంబుగామ, మెదన్‌పూర్, అంబకంటితండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో మండలంలో ప్రస్తుతం పంచాయతీల సంఖ్య 15కు చేరింది. కానీ కొత్త పంచాయతీలకు సొంత భవనాలులేక అద్దె భవనాలు, పాఠశాల భవనాల్లో కొనసాగిస్తున్నారు. కొన్ని చోట్ల నూతన భవనానికి శ్రీకారం చుట్టినా నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

ఒక్కో భవనానికి రూ.20లక్షలు..

కుంటాల మండలంలోని నాలుగు కొత్త పంచాయతీ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద నిధులు కేటాయించింది. ఒక్కో పంచాయతీ భవనానికి సుమారు రూ.20 కేటాయించడంతో పనులు చేపట్టారు. అంబుగామ, మెదన్‌పూర్ గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, వెంకూర్, అంబకంటి తండాలో పాఠశాలల భవనంలో నిర్వహిస్తున్నారు. అంబకంటి తండా, వెంకూర్, అంబుగామ గ్రామాల్లో పంచాయతీల భవనాలకు ఇప్పటివరకు సుమారు రూ.14.5 లక్షల వరకు నిధులు విడుదల చేయడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు స్లాబ్ వరకు పూర్తి చేసి వదిలేశారు. మెదన్‌పూర్ గ్రామంలోనైతే ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టలేదు. నిధుల విడుదలలో జాప్యం జరగడంతో పనులు నిలిచిపోయాయి.

ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు..

పంచాయతీ కార్యాలయాల్లో సొంత భవనాలు లేకపోవడంతో సమావేశాల నిర్వహణకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అద్దె భవనాల్లో స్థలం సరిపోక సమావేశాలు బయట నిర్వహిస్తున్నారు. ఒంటికి, రెంటికి వెళ్లేందుకు మరుగుదొడ్డు కూడా సరిగా లేదు. అధికారులు స్పందించి నిధులు విడుదల చేసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వార్షికోత్సవం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో సంత్ సదుర్గ పూలాజీబాబా ధ్యాన్ మందిర్ 19వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. పూలాజీ బాబా చిత్రపటానికి నివాళులర్పించారు. ఆదివాసీ అండ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అ ధ్యక్షుడు రాందాస్, మారుతి, మాధవ్, శివాజీ ఉన్నారు.